## వీఆర్ఏలపై లాఠీచార్జి తగదు : టిపిసిసి సభ్యుడు నరోత్తం

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చేసిన హామీలను అమలు చేయాలని దీక్షలు చేస్తున్న వీఆర్ఏలపై పోలీసులతో లాఠీచార్జి చేయించడం తగదని టిపిసిసి సభ్యులు వై నరోత్తం ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్ఏల సమస్యలు పరిష్కరిస్తానని శాసన సభ సాక్షిగా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హామి చేశారని, హామీలను అమలు చేయకపోగా వీఆర్ఏలపై లాఠీలు రుళిపించడం ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో విలేఖరులతో నరోత్తం మాట్లాడుతూ గత 50 రోజులుగా వీఆర్ఏలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి పట్టకపోవడం విచారకరమని ఆరోపించారు. సమ్మెలో ఉన్న 32 మంది వీఆర్ఏలు ఆందోళనతో అనంతలోకాలకు చేరిపోయారని విస్మయం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీఆర్ఏలకు చేసిన హామీలను అమలు చేయాలని నరోత్తం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు మైనోద్దీన్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నాగిశెట్టి, మాజీ ఎంసిటిసి హన్మంత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు నాయక్, నాయకులు సుధాకర్, గోపాల్ పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## దీక్షలతో జీవితాలకు మోక్షం

**పుల్కల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** దీక్షలతో ఆధ్యాత్మిక చింతన కల్గడంతో పాటు మనసు ప్రశాంతంగా ఉంటుందని ఫలితంగా జీవితాలకు మోక్షం లభిస్తుందని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు, సీడిసి డైరెక్టర్ జైపాల్‌నాయక్ అన్నారు. మంగళవారం ఉమ్మడి పుల్కల్ మండలంలోని బొమ్మరెడ్డిగూడెం,హనీమా నాయక్ తండా, ఉమ్లా నాయక్ తండా, పత్తికుంట తండా, విఠల్ నాయక్ తండా, సంగ్య నాయక్ తంఆ, లాల్‌సింగ్ నాయక్ తండా, ముదిమాణిక్యం తండా, గొంగులూరు తండా, కోడూర్ తండా, మిన్పూర్ తండాలకు చెందిన దీక్షా పరులు మంగళవారం మండలంలోని బొమ్మారెడ్డి గూడెంలోని భవానిమాత ఆలయం వద్ద భోగ్ బండార్ పూజలను నిర్వహించారు. దీక్షలతో ప్రజల్లో ఆధ్యాత్మికత పెరుగుతోందన్నారు. ఆలయానికి చేరుకున్న దీక్షా పరులకు, భక్తులకు తెలంగాణ రాష్ట్రవెనుకబడిన తరగతుల సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సతీష్‌కుమార్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దీక్షాపరులు దేవిదాస్, సురేందర్, సంతోష్, ధన్‌రాజ్, రాకేష్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

### అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:**

మంగళవారం ఉదయం 11 గంటలకు ధాన్యం కొనుగోలు వర్షాకాలం 2022-23 గురించి సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధ్యక్షత వహించారు. అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి, ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా పౌర సరఫరా అధికారి, జిల్లా మేనేజర్, సిఎస్‌సి, జిల్లా కో-ఆపరేటీవ్ అధికారి, డిప్యూటీ తాహసిల్దార్ (సిఎస్), ఎపిఎం, డిపిఎం, ఎవోస్, ఎఈఓఎస్, రాష్ట్ర సమైఖ్య సమితి కో-ఆర్డినేటర్స్, రైస్ మిల్లర్స్, పాడ్డి కాంట్రాక్టర్స్‌లతో సమావేశం జరిగింది. ఈ ఖరీఫ్ సీజనులో పిఎసిఎస్/డిసిఎన్ఎస్ ద్వారా 78 కేంద్రాలు, ఐకెపి ద్వారా 77 కేంద్రాలు మొత్తం 155 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగింది. ఇందుకుగాను ప్రభుత్వం మద్దతు ధర ప్రకారం గ్రెడ్-ఎ ధాన్యానికి రూపాయలు 2060 ఫర్ క్వాట్ల్స్, కామన్ ధాన్యముకు రూపాయలు 2040 ఫర్ క్వాట్ల్స్ కి చోప్పున రూపాయలు చెల్లించడం జరుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అంచనా ప్రకారం జిల్లాలో 2,52,000 టన్నుల ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేయవచ్చు. అంతేకాకుండా వాతావరణం కూడా అనుకూలంగా లేనందు వల్ల ధాన్యం వర్షం కారణంగా తడవకుండా సురక్షితంగా భద్రపరచాలని సూచించారు. దీనికై ఎఎంసి గోడౌన్‌లను వినియోగించుకోనుటకై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా మేనేజర్‌ను ఆదేశించారు. అన్‌లోడింగ్, కస్టమ్ మిల్లింగ్‌ను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో బియ్యంను డెలివెరి చేయాలని, అవసరం అయితే అధిక హమాలీలను వినియోగించుకోవాలని రైస్ మిల్లర్‌లను ఆదేశించారు. ధాన్యం సేకరణలను త్వరగా టాబ్లో నమోదు చేసేటట్లు కొనుగోలు కేంద్ర ఇంఛార్జీలకు సూచించమని జిల్లా కో-ఆపరేటీవ్ అధికారి, డిపిఎంలను ఆదేశించారు. ప్రతి కేంద్రానికి రెండు వాహనాలను ట్యాగ్ చేయాలని, అధిక వాహనాలను పూల్ చేసి రవాణా వేగవంతం అయ్యేటట్టు కాంట్రాక్టర్లకు సూచిస్తూ ఈ కార్యక్రమం త్వరగా పూర్తయ్యేట్టు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారిని ఆదేశించారు. అంతే కాకుండా రైతులు తెచ్చిన ధన్యమంతయు కొనుగోలు చేసి వారికి సకాలములో చెల్లింపులు జరుగుటకుగాను అన్ని చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

## భక్తులతో కిటకిటలాడిన జ్యోతీర్వాస్తు విద్యాపీఠం

### ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ శరత్ దంపతులు

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:**



జ్యోతీర్వాస్తు విద్యాపీఠం సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి మండలం పసల్‌వాది గ్రామంలోని శ్రీ జ్యోతీర్వాస్తు విద్యాపీఠంలో రెండవ రోజు జరుగుతున్న శ్రీ విద్యా గణపతి యాగంలో సద్గురు శ్రీ మాధవానంద సరస్వతీ స్వామివారు పాల్గొని భక్తులకు ఆశీస్సులు అందజేశారు. వైదోక్తంగా జరుగుతున్న శ్రీ విద్యా గణపతి యాగంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ దంపతులు పాల్గొని విద్యాపీఠాన్ని సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

## గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



రుద్రారంలో పర్యటిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ ఓడిఎఫ్ బృందం

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరు ఆరోగ్యంగా ఉంటారని స్వచ్ఛభారత్ బృందం సభ్యులు అన్నారు. మంగళవారం మండల పరిధి రుద్రారం గ్రామంలో స్వచ్ఛ భారత్ మిషన్ బృందం సభ్యులు పర్యటించి గ్రామాధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలో ప్రతి ఇంటికి తప్పనిసరిగా మరుగు దొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ భవనం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. వర్షపు నీరు ఆవరణలో నిలువ ఉండకుండ చూడాలని తెలిపారు. వారి వెంట సర్పంచి మంచాల లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, టెక్నికల్ అసిస్టెంటు సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్లు నాగభూషనం ఉన్నారు.

## ఐఐటి, ఎన్ఐటిల్లో సత్తాచాటిన గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు

**నర్సాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గునరుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇటీవల జరిగిన ఐఐటి, ఎన్ఐటి పక్షల్లో ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ రామ్మోహన్ తెలిపారు. మంగళవారం నాడాయన గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ సిఓఇ చరిత్రలో ఎన్నడు సాధించనటువంటి ర్యాంకులను తమ కళాశాల విద్యార్థులు సాధించారన్నారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 6 మంది ఎన్ఐటిలో, ముగ్గురు ర్యాంకులు సాధించారని గుర్తు చేశారు. తమ కళాశాలలో చదువుతున్న శ్రీశైలం 121 ర్యాంకు సాధించి రాష్ట్రంలోనే తమ కళాశాలకు మంచి పేరును సాధించి పెట్టారని అన్నారు. రాష్ట్రంలో ర్యాంకు సాధించి పెట్టిన విద్యార్థి శ్రీశైలంను గిరిజజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అభినందించారని తెలిపారు. ర్యాంకులు సాధించి కళాశాలకు మంచి పేరును తీసుకొచ్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోమన్ తో పాటు అధ్యాపకులు కూడ అభినందించారు.



ఎన్ఐటిల్లో రాష్ట్రంలో ర్యాంకు సాధించిన విద్యార్థి శ్రీశైలంను అభినందిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

### 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ

# ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్ అర్బన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:**

సమర్థుడైన నాయకులను ఎన్నుకోవడంలో ఓటర్లే కీలకమని, కాబట్టి 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. గతంలో జనవరి 1 ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన యువతకు ఒకసారి మాత్రమే ఓటరుగా నమోదుకు అవకాశం ఉండేదని, కానీ భారత ఎన్నికల కమీషన్ ఎక్కువ మంది యువ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఏటా జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించుటకు సంవత్సరంలో నాలుగు పర్యవయాలు ఓటరు నమోదుకు అవకాశం కల్పించిందన్నారు. భారత రాజ్యాంగంలో ఓటు హక్కు ఎంతో ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ నైతికంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో వివిధ కళాశాలల అంబాసిడర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో మాటనఆలడుతూ ఎలక్టోరల్ లిటరసీపై కళాశాలల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించడంతో పాటు బంధువులు, స్నేహితులకు ఓటు ప్రాముఖ్యతను వివరించి ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. కాగా ఓటరు నమోదుకు కొత్తగా రూపొందించిన ఫారం-6ను ఉపయోగించాలన్నారు. ఇది వరకు ఓటరు కార్డు ఉన్న వారు ఫారం 6-బి ద్వారా ఆధార్ కార్డుల అనుసంధానం చేయాలని, అభ్యంతరాలుంటే ఫారం-7, చిరునామా మార్పు, సవరణలకు ఫారం-8 ఉపయోగించాలని సూచించారు. ప్రతి ఒక్క యువత ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, లేదా ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాంపస్ అంబాసిడర్లకు జాతీయ ఓటరు దినోత్సవం రోజున జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేస్తామని తెలిపారు.

రాజస్వ మండల అధికారి సాయిరాం మాట్లాడుతూ బ్లాక్ స్థాయి అధికారుల సహకారంతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదయ్యేలా కృషి చేయాలని అంబాసిడర్లకు సూచించారు. స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్యాంపస్ అంబాసిడర్లకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో శైలేష్, ఈడీఎం సందీప్, ఎలక్టోరల్ లిటరసీ నోడల్ అధికారులు, క్యాంపస్ అంబాసిడర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలి

### సీపీ శ్వేత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

వర్టికల్ వారిగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని..ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్ల వేళాల అందుబాటులో ఉండి సేవలు అందించాలని సీపీ ఎన్.శ్వేత సూచించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం 3 టౌన్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి పోలీసుస్టేషన్ చుట్టూ ఉన్న పరిసరా ప్రాంతాలను పరిశీలించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, అబ్బాండెడ్ వాహనాలను పరిశీలించి త్వరగా డిస్పోజల్ చేయాలని సీఐ భాను ప్రకాష్‌కు సూచించారు. పోలీసు స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించి 5ఎస్ ఇంప్లిమెంటేషన్ పూర్తి చేయాలన్నారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి పోలీసుస్టేషన్‌లో ఏ తరహా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని తక్షణ సేవలు అందించాలన్నారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్స్, సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాతనేరస్తులను తనిఖీ చేయాలన్నారు.



3 టౌన్ పోలీసు స్టేషన్‌ను మాట్లాడుతున్న సీపీ శ్వేత

విధి నిర్వహణలో రోల్ క్లారిటీ, గోల్ క్లారిటీ ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలన్నారు. ప్రజల రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. విపిఓ పోలీసు ఆఫీసర్ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు స్టేషన్‌ను పచ్చదనం పరిశు భ్రతతో అహ్లాద కరమైన వాతావరణంలో ఉంచాలన్నారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే హెచ్‌ఆర్‌ఎంఎస్ గ్రీవెన్స్ సెల్ ద్వారా పంపించాలన్నారు. పోలీసు స్టేషన్ రికార్డ్సు, సీడీ ఫైల్స్‌లో ఇన్వెస్టిగేషన్ ఎస్‌ఓపి ప్రకారం ఉన్నదని పోలీసు అధికారులను, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో 3 టౌన్ సీఐ భానుప్రకాష్, సీసీఆర్బి ఇన్‌స్పెక్టర్ సైదానాయక్, ఎస్ఐ కొమురయ్య, హెడ్ కానిస్టేబుళ్లు తిరుపతిరెడ్డి, పాపయ్య,యాదగిరి, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్

### బిజెపి జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

నిజాం మెడలువంచి తెలంగాణకు స్వేచ్ఛ వాయువులు అందించిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పేటల్ అని బిజెపి జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం ఆపరేషన్ పోలో పేరిట హైదారాబాద్ సంస్థానాన్ని ముట్టడించిన రోజును పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ముస్తాబాద్ చౌరస్తాలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజాకార్లు తెలంగాణ ప్రజలు, మహిళలపై దాడులు చేసి రక్తపాతం సృష్టిస్తే వారికి ఎదురొడ్డి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆనాడు స్వాతంత్రం కల్పించేందుకు పోలీసు యాక్షన్ ప్రకటించారని గుర్తు చేశారు. పోలీసు యాక్షన్ మూలంగా యేడాది తర్వాత తెలంగాణ భారత దేశంలో విలీనమైన జాతీయ జెండా ఎగిరిందన్నారు. తెలంగాణ ప్రజలు దేవుడిలా చూసుకునే సర్దార్‌ను టిఆర్ఎస్ సర్కారు విస్మరించిందని వాపోయారు. టిఆర్ఎస్ అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహిస్తామని చెప్పిన కెసిఆర్ 8 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఎంఐఎం పార్టీకి తలొగ్గి సమైక్యత దినోత్సవం జరపడం లేదన్నారు. సిఎం కెసిఆర్‌ను గద్దె దించడానికి ప్రజలు సిద్దంగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో బిజెపి అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రతి శ్రీనివాస్ యాదవ్, ఉడత మల్లేశం యాదవ్,కోడూరు నరేష్, రోశయ్య, మల్లమ్మగారి శ్రీనివాస్‌రెడ్డి, గుండ్ల జనార్ధన్, తొడుపునూరి వెంకటేశం, గోనె మార్కండేయులు, అరుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

# రియల్ దందా.. గడిపెద్దపూర్ చెరువులో నుంచి రోడ్డు..!

### చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

**అల్లాదుర్గం, సెప్టెంబరు, 13, ప్రభాతవార్త:**

రియాల్ ఎస్టేట్ దందా వ్యాపారులు కాసులతో అందరి కళ్లు మూస్తున్నారు. అల్లాదుర్గం మండలంలో ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నట్లా లేక ఉండి లేననిఅనుంటున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. రియల్ దందాలో పట్ట పగలే కొందరు వ్యాపారులు దర్జాగా రోడ్లు వేసుకుంటున్నా చూసి చూడనట్లు ఉండడంపై పలు అనుమానాలు వస్తున్నాయి. సమీపంలో 6 ఎకరాలను కొనుగోలు చేశారు.ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు.. 161 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గడి పెద్దపూర్ గ్రామ శివారులో పఠాన్‌చెరుకుంట అలుగుమీదుగా రియల్ వ్యాపారులు దర్జాగామట్టితో రోడ్డును వేసుకున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామంటూ బుకాయిస్తున్నట్లు గ్రామస్థులు చెప్పారు. ఇలా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆగడాలు మితిమీరిపోతున్నాయి. రైతులకు మూలాధారం అయిన చెరువులు పటిష్టంగా ఉంటేనే వాటి ద్వారా పొలాలు పండించుకోవచ్చునని ప్రభుత్వం లక్షలాది రూపాయలను మంజూరు చేస్తూ వాటి అబివృద్ధికి కృషి చేస్తుంది. చెరువుల కాల్వలు బాగుంటేనే రైతులు పంటలు పండించుకునే ఆస్కారం ఉంటుంది.



అక్రమంగా రోడ్డు నిర్మాణం వేసిన దృశ్యం

కాగా సంపాదనే ధ్యేయంగా ఎంచుకున్న రియల్ మాఫియా కాల్వలను కప్పేస్తూ వారు రహదారులను నిర్మాణాలను చేపడుతున్నారు. వీరికి అడిగేవారు లేరన్న ధీమాతో వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చెరువు, కుంటలపైన దర్జాగా రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారు. ఈ రోడ్లను చూసి ఆయా కట్టదారులు తమ పంట పోలాలకు నష్టం సంభవిస్తుందని లబోదిబోమంటున్నారు.

**వాస్తవమే.. చర్యలు తీసుకుంటున్నాం : ఎఇ**

ఈ విషయమై ఇరిగేషన్ ఎఈ తిలక్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా వాస్తవమే.. ఆ విషయం మా దృష్టికి వచ్చిందని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి అలుగు మీదుగా పోసిన మట్టిని తీయించి వేస్తామన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

### తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశంలో

## విలీనం చేసిన ఘనత కమ్యూనిస్టులదే

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

తెలంగాణరాష్ట్రం నైజాం రాక్షస పాలనలో బంది గా ఉన్నా ప్రజలకు స్వేచ్ఛ కల్పించి హైదారాబాద్ రాష్ట్రాన్ని భారత దేశంలో విలీనం చేసిన ఘనత కమ్యూనిస్టులదే అని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం భారత దేశంలో విలీనమై 74 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవనంలో వార్షికోత్సవ సభ సీపీఐ పట్టణ కార్య దర్శి బన్సీలాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో నైజం నిరంకుశత్వానికి..వెట్టి చాకిరికి, భూస్వాముల అగడాలకు, దేశముఖ్‌లకు వ్యతిరేకంగా నిజాం రాక్షస పాలన అంతమొందించాలని నాడు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయధ పోరాటాలకు రవి నారాయణరెడ్డి, ముగ్ధుమ్ మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డిలు పిలుపునిచ్చారని తెలిపారు. అనాటి పోరాటం ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కిందన్నారు. అనాటి పోరాటంలో 4500 మంది వీరమరణం పొందారని 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని తెలిపారు. మూడు వేల గ్రామాలను నైజాం రాక్షస పాలన నుంచి విముక్తి చేసిన చరిత్ర సీపీఐ పార్టీకి దక్కుతుందన్నారు. నిజాం నిరంకుశ పాలన పోరాటానికి సంబంధం లేని బిజెపి నేడు హింద-ముస్లింల మధ్య తగాదాలు రెచ్చగొట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జరిగిన సమయంలో బిజెపి పుట్టుకనే లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకుంట్ల శంకర్, కిష్టపురం లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు జేరిపోతుల జనార్ధన్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి సుధాకర్, పిట్ల మల్లేశం, కర్ణాల చంద్రం, బిక్షపతి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

### 17న బ్యాంక్ లోక్ అదాలత్

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఈ నెల 17వ తేదీన సంగారెడ్డిలో బ్యాంక్ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జె హన్మంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఉత్తర్వుల ప్రకాం, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి యస్ శశిధర్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న బ్యాంక్ లోక్ అదాలత్‌ను బ్యాంక్ అధికారులు, రుణగ్రహీతలు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హన్మంత్‌రావు సూచించారు.

### నూతన వ్యాపారాలతో వృద్ధి సాధించాలి : డిపిఎం

**చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** మహిళా సంఘం సభ్యులు నూతన వ్యాపారాలను ప్రారంభించి వృద్ధి సాధించాలని డిపిఎం కెన్నడి అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేటలో రెండోరోజు నిర్వహించిన మహిళా సమాఖ్య సీసీలు, వీఏవోల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజీక, ఆర్థిక, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళా సభ్యులు ఆలోచనలు,లక్ష్యాలను నమోదు చేసుకోని వాటిని సాధించేలా కృషి చేయాలని సూచించారు. డిఎంజి నాగరాజు, లాలునాయక్, సీసీలు యశోద రాజు, కృష్ణ, నాగరాజు, అకౌంటెంట్ ధనలక్ష్మీ వివిధ గ్రామాల వీవోఏలు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

### పరారీలో మరొకరు

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఇంట్లో నుంచి వస్తానని వెళ్లిన యువతి శవమై కానవచ్చిన సంఘటన పటాన్‌చెరువులో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... పట్టణానికి చెందిన మహమ్మద్ సమీర్‌అహ్మద్(28) ఈ నెల 9వ తేదీన ఉదయం 6.30 గంటలకు ఇంట్లో నుంచి పనిమీద వెళుతున్నానని, తిరిగి త్వరగా వస్తానని వెళ్లిన సమీర్ రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో 10వ తేదీన తండ్రి సలీం ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు 12వ తేదీన పలువురు అనుమానితులను పటాన్‌చెరువుకు చెందిన షేక్ ఇలియాస్(32), షేక్ రుస్తుం అలీ (22)లు పోలీసు ఠాణాలో తమదైన రీతిలో విచారణ చేయగా తమతో పాటుఅల్లావుద్దీన్‌తో కలిసి సమీర్‌ను హత్య చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. శవాన్ని పట్టణ శివారులోని సయ్యద్ మురాద్‌అలీ షా దర్గా వద్ద గల ముస్లిమ్స్ స్మశాన వాటిక నందుపూడ్చి పెట్టినట్లు పేర్కొన్నారన్నారు. 8 మాసాల క్రితం షేక్ ఇలాయాస్ తన అవసరాల కోసం సమీర్‌ను డబ్బులు అడుగగా సమీర్ తనకు పరిచయస్తుల ముందు 3నెలల కొరకు 50 వేల రూపాయలను చేబదులుగా ఇచ్చారన్నారు. నెలలు గడుస్తున్నా తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వకపోగా సమీర్‌ను హతమర్చాలని పథకం పన్ని ముగ్గురు కలిసి సమీర్‌ను హత్యచేశారన్నారు. సమీర్ వినియో గించిన స్కూటీని పెట్రోల్ పోసి నిప్పంటించారన్నారు. మంగళవారం తహసీల్దార్ శవాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించి పోస్టు మార్టం చేపట్టి కుటుంబ సభ్యులు అప్పగించామన్నారు. సమీర్‌ను హతమర్చిన షేక్ ఇలాయాస్, రుస్తుంఅలీలను అరెస్టు చేసి వారినుంచి ఇనుపరాడ్డు, మోటార్‌సైకిల్, పారలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నార. పరారీలో ఉన్న అల్లావుద్దీన్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### గంజాయి మొక్కల ధ్వంసం

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని దామరగిద్ద పంచాయితీ పరిధిలోని గోపాల్ నాయక్ తండాలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు మంగళవారంద ధ్వంసం చేశారు. తండాకు చెందిన ఓ రైతు తనకు చెందిన 1ఎకరం వ్యవసాయ భూమిలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని సాగుచేస్తూ ఉన్నాడు. విశ్వసనీయ వర్గాల సూచన మేరకు మంగళవారం జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ గాయత్రిదేవి ఆదేశాల మేరకు పోలీసులు వ్యవసాయ పొలానికి చేరుకుని పరిశీలించగా మొక్కల సాగును గుర్తించారు. సాగు చేస్తున్న 2435 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. ధ్వంసం అయిన మొక్కల విలువ 2లక్షల రూపాయల వరకు ఉంటుందని ఎక్సైజ్ సిబ్బంది నందు సింగ్, శంషుద్దీన్‌లు పేర్కొన్నారు.



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు


ఎంపికి అహ్వాన పత్రిక అందిస్తున్న అరెకటిక సంఘం ప్రతినిధులు

## అరెకటికల అత్మీయ సభను విజయవంతం చేద్దాం

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 20న జరిగే అరెకటిక అత్మీయ సభకు రావాలని కోరుతూ మంగళ వారం హైదారాబాద్‌లోని ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డిని అయన స్వగృహంలో అరె కటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొంపల్లి అశోక్ అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి అహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా అరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొంపల్లి అశోక్ మాట్లాడుతూ అరెకటికల సమస్యల సాధనకు తన వంతు సహకారం అందిస్తానని ఎంపి హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సిద్దిపేటలో నిర్వహించే అరెకటికల అత్మీయ సభను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో అరెకటిక సంఘం ప్రతినిధులు గజభీంకర్ మధు, బాలరాజు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాట వారోత్సవాలు విజయవంతం చేయాలి
### -సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్


మాట్లాడుతున్న గడిపె మల్లేష్

**హుస్నాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట 74వ వార్సికోత్స వాలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నా బాద్ మండలం మహ్మదాపూర్ గ్రామంలో గల సాయుధ పోరాట వీరుల సమాదులను సందర్శించిన ఆయన ఏర్పాటు చేసన సమావేశంలో మాట్లా డుతూ భూమికోసం, భుక్తికోసం , ప్రజల విముక్తి కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటాలు నిర్వహించిన అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డితో పాటు మరో పదిమంది మృత వీరుల స్ఫూర్తితో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాఉద్యమాలు చేసేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 16శుక్రవారం రోజున సాయుద పోరాట వార్షికోత్స వాల సందర్భంగా సిపిఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి, జాతీయ కార్య వర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ మహ్మదాపూర్‌కు రానున్నారని, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు బద్దిపడగ రాజిరెడ్డి, అయిలేని సంజీవరెడ్డి, మహ్మదాపూర్ గ్రామశాఖ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శి రాజయ్య, నాయకులు బాలయ్య, మొగిలయ్య, క్రాంతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన నాయకుల ముందస్తు అరెస్టు


అరెస్టయిన గిరిజన నాయకులు

**హుస్నాబాద్ రూరల్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** గిరిజనులకు రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రోజున గిరిజన సంఘాలు అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో హుస్నాబాద్‌లో గిరిజన సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు భాస్కర్‌నాయర్ మాట్లాడుతూ గిరిజన సంఘాల పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెల్లకుండా గిరిజన నాయకులను టిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమంగా ముందస్తు అరెస్టు చేపించడం సిగ్గుచేటన్నారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని భేషరతుగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో బిజెపి నాయకులు గుగులోతు రాజునాయక్, గిరిజన నాయకులు సత్యం నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డిసిసిబి డిపాజిటర్లకు అధిక వడ్డీ చెల్లిస్తాం
### -మేనేజర్ నిత్యరెడ్డి

**ములుగు, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** డిసిసిబి బ్యాంకు డిపాజిటర్లకు అధిక వడ్డీ చెల్లిస్తామని బ్రాంచి మేనేజర్ నిత్యరెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇతర బ్యాంకుల్లో డిపాజిటర్లకు 5 నుంచి 6 శాతం మాత్రమే వడ్డీ చెల్లిస్తున్నారని, ఒక్క డిసిసిబి బ్యాంకు మాత్రమే 7 నుంచి 7.50 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని, నూతనంగా ప్రవేశపెట్టిన వజ్రోత్సవ డిపాజిట్లపై నార్మల్ కిస్టమర్లకు 7 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.50 శాతం చెల్లిస్తామని, ఫిక్స్ డిపాజిట్ కాలపరిమితి మినిమం 333 రోజులు ఉండాలని తెలిపారు. ఆసక్తిగల కస్టమర్లు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె డిపాజిటర్లను కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన బొమ్మ శ్రీరామ్

**హుస్నాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** పట్టణంలోని కేబి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో కనీస సౌకర్యాలు లేక పసి పిల్లలు బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని విషయం తెలుసుకున్న బిజెపి నేత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మంగళవారం కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పార్టీ శ్రేణులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం అ ంగన్ వాడీ కేంద్రంలోని సమస్యలపై సిడిపివో జయశ్రీతో ఫోన్‌లో మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, పార్టీ పట్టణ అధ్యక్షుడు శంకర్‌బాబు, మండల అధ్యక్షుడు చెక్కబండి విద్యా సాగర్, కోమటి సత్యనారాయణ, అక్కు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రాచీన చరిత్ర విలువలను మరువొద్దు : సీపీ శ్వేత

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** ప్రాచీన చరిత్ర విలువలు భావాలను ఎప్పుడూ మరువొద్దని..వాటిని కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలని సీపీ ఎన్.శ్వేత సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన రెండు రోజుల రాష్ట్ర స్థాయి అవ గాహన సదస్సు ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో అమె పాల్గొని మాట్లాడారు. మహానుభావుల జీవిత చరిత్ర అవగాతం చేసుకోవా లన్నారు. భూత భవిష్యత్ కాలాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మనిషి ఏదో ఒక రంగంలో రాణించాలన్నారు. భారతదేశ వారసత్వ నాణ్యాల సేకరణ గ్యాలరీని సందర్శించి గ్యాలరీ ఏర్పాట చేసిన డిపార్ట్‌మెంట్ అఫ్ అర్ట్స్ అధ్యాపకులను అమె అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి. హెచ్.ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీ శ్వేత

# సర్ధార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి

**హుస్నాబాద్, సెప్టెంబరు 14,ప్రభాతవార్త**
అమరవీరుల స్ఫూర్తితో బంగారు తెలంగాణ సాధన కై రాష్ట్ర ప్రజలు ఉద్యమించాలని బిజెపినేత బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి అన్నారు. మంగళవారం హుస్నా బాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బిజెపి పట్టణ, మండల అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, చెక్కబండి విద్యాసాగర్ ఆధ్వర్యంలో శ్రీరాంచక్రవర్తి తెలంగాణ ప్రాంత విమోచన కోసం ఆపరేషన్ పోలో చేపట్టిన రోజు ఆగస్టు 14 అని, ఈ నేపధ్యంలో అప్పటి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి, హుస్నాబాద్ కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, ఒబిసి మోర్చ జిల్లా కార్యదర్శి కందుకూరి సతీష్, నాయకులు బొమ్మగాని రవిందర్, కాయిత అరుణ్ రెడ్డి, సంపత్‌నాయక్, పట్టణ ఉపాధ్యక్షుడు పోలోజు రవిందర్, కిష్టయ్య, శ్రీనివాస్, శ్రావణ్, అక్కు శ్రీనివాస్, బిజెవైఎం నాయకులు వెంకటేష్, శ్రీని వాస్, లింగారెడ్డి, కుమారస్వామి, సత్యం, సుధాకర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అక్కన్నపేటలో...**
మంగళవారం బిజెపి అక్కన్నపేట మండల అధ్య క్షుడు గొల్లపల్లి వీరాచారి ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రాష్ట్రాన్ని భారత్‌లో విలీనం చేసేందుకు అప్పటి ఉపప్రధాని సర్ధార్ వల్లబాయ్ పటేల్ సైనిక చర్యలు చేపట్టి రాష్ట్రన్ని భారతదేశంలో విలీనం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ సైనిక చర్య చేపట్టిన రోజు సందర్భంగా పార్టీ నాయకులతో కలసి వీరా చారి సర్ధార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టి మోర్చ అధ్యక్షుడు నునావత్ మోహన్ నాయక్, అధికర ప్రతినిధి తిరుపతిరెడ్డి, నాయకులు భూక్య సుధాకర్, మహేందర్, కృష్ణ, ఐలయ్య, కళ్యాణ్ విష్ణు, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్, గుగులోతు


హుస్నాబాద్‌లో సర్ధార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

రాజునాయక్, చొక్కం గణేష్, రాజనర్సు పాల్గొన్నారు.

**కొహెడలో...**
**కొహెడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంత విముక్తికై సర్ధార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన అప రేషన్ పోలో(పోలీసు చర్య) సెప్టెంబర్ 13 ప్రారం భించిన రోజును పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొహెడలోని పాత బస్టాండ్ సమీపంలో సర్ధార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి ఆ పార్టీ నేతలు పూలమాలలువేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ హైదారాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయదానికి ఆనాటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీసు చర్య ఆపరేషన్‌లో పోలో సెప్టెంబర్ 13న ప్రారంభించి కేవలం నాలుగురోజుల వ్యవధిలో నిజాం మెడలు వంచి సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన మహానుభావుడు సర్ధార్ వల్ల భాయ్ పటేల్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయ కులు గుగ్గిళ్ల శ్రీనివాస్, మ్యాకాల రజనీకాంత్‌రెడ్డి, బండ జగన్ యాదవ్, బొమ్మగాని శివకుమార్‌గౌడ్, చేపూరి తిరుపతి, కంది సత్యనారాయణరెడ్డి, గాజుల వెంకటేశ్వర్లు, పొన్నాల సాగర్, చిగురు సంజీవరెడ్డి, బండ సుమన్ యాదవ్, దాము కుమారస్వామి, నన్నె శ్రీనివాస్, గోవిందు రమేష్ పాల్గొన్నారు.

**తొగుటలో...**
**తొగుట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :**
నిజం నిరంకుశ పాలన నుంచి విముక్తి కల్పించ డానికి సర్దార్‌వల్లభాయ్ పటేల్ నిజం సంస్థానంపై ఆర్మీ బలగాలను(ఆపరేషన్ పోలో) సెప్టెంబర్ 13న ప్రారంభించిన మంగళవారం మహనీయులు సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను సర్మించుకున్నారు. ఈ సంద ర్భంగా బిజెపి, బిజెవైఎం నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విభీషన్‌రెడ్డి, నంట స్వామిరెడ్డి, నరేష్ గౌడ్, కళ్యాణ్ దాస్, గుడికందుల ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, స్వామి, నవీన్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, గుల్ల రాజు, సాగర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


తొగుటలో పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


సర్ధార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళులర్పిస్తున్న బిజెపి, బిజెవైఎం నాయకులు

## పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని
### అసెంబ్లీలో తీర్మానం చేయడం చరిత్రాత్మకం: మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** కొత్తగా నిర్మిస్తున్న పార్లమెంట్ భవ నానికి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరు పెట్టాలని సిఎం కెసిఆర్ నేతృత్వంలో అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయంఅని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ మేధావి అని, ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాన్ని రచించి దేశానికి దశ దిశ నిర్దేశించి నటువంటి మహానుభావుడు అన్నారు. అనేక కులాలు, మతాల సమాహారమైన దేశంలో అందరికి సమాన అవకాశాలు కల్పిస్తూ ఐక్యతను, సమగ్రతను చాటే విధంగా భారత రాజ్యాంగాన్ని అందించిన మహా శిల్పి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అన్నారు. సమాజం పక్షాన చొరవ చూపడం నిజంగా అభినందనీయమన్నారు. సిఎం కెసిఆర్ నిర్ణయాన్ని అందరూ ఆమోదయోగ్యం తెలిపారని, పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశం లో ఎంపిపి అమరావతి, వైస్ ఎంపిపి బెల్దె కృష్ణాగౌడ్, ఎంపిటిసి సభ్యులు, మండల టిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పాల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## హర్షం

**గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** అసెంబ్లీలో మంత్రి కెటిఆర్ కొత్త పార్లమెంట్ భవనానికి భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టాలని తీర్మాణాన్ని ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. మహాత్మగాంధీకి ఏమాత్రం తగ్గని మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టడం సముచితంగా ఉంటుందన్నారు. చట్టాలు చేసే ముందు, సంస్కరణలు చేసే ముందు భారత సమాజాన్ని అర్థం చేసుకోమని చెప్పిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. సమసమాజం నిర్మాణం కోసం అనునిత్యం పోరాడిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావంతో దేశ నిర్మాణం సాగాలన్న అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

## పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలి

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును నామకరణం చేయాలని జగదేవ్‌పూర్ మండలకేంద్రం వార్డు సభ్యులు మచ్చ గణేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ అసెంబ్లీలో పార్లమెంట్‌కు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ పేరు పెట్టడానికి ఏకగ్రీవంగా తీర్మాణం చేస్తామనడం గొప్ప విషయమని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, ముఖ్యమంత్రి కెసిఆర్‌కు దళితుల పట్ల గౌరవం ఉందని, దళితుల అభివృద్ధి కోసం దళితబంధు తదితర పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు పార్లమెంట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని కోరుతున్నట్లు తెలిపారు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు

**మర్కుక్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తిలో టిఆర్ఎస్ యూత్ విభాగం మండల అధ్యక్షుడు కర్ణాకర్ దంపతులు మంగళవారం గణనాథున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

## సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి
### డిప్యూటీ డిఎంహెచ్‌వో కస్తూరి సౌమ్య

**హుస్నాబాద్, సెప్టెంబరు14, ప్రభాతవార్త :** సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో కస్తూరి సౌమ్య అన్నారు. మంగళవారం రోజున హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపధ్యంలో సీజనల్ వ్యాదులతో పాటు డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వ్యాది సోకకుండా ఉండేందుకు ప్రజలు తమ ఇండ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చి రెండు రోజులైన తగ్గకపోతే కచ్చితంగా డెంగ్యూ పరీక్షలు చేసుకోవాలని ఈ పరీక్షను పట్టణంలోన ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ దయగ్నోసిస్ హబ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వర్షాలు కురిసే సమయంలో తేలికపాటి జ్వరాలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకోవాలన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గజ్వేల్‌కు చెందిన మున్నూరుకాపు ఉపాధ్యాయులు గంగిశెట్టి కవితనర్సింలు, నవనీతరాజు, మాదాల రవీందర్‌లు ఉత్తమ ఉపాధ్యాయులు గా ప్రభుత్వం తరపున ప్రశంసలు పొందిన సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు చంద నర్సింలు, బండ్ల స్వామి, గంగిశెట్టి నర్సింలు, ఆర్‌కె.శ్రీనివాస్, అల్వాల బాలేష్, న్యాయవాది హరికృష్ణ, నాయిని కృష్ణమూర్తి, మామిడి శంకర్, శేఖర్ పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని తీగుల్ గ్రామానికి చెందిన జూపల్లి హనుమవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మంగళవారం మండల రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేశ్ రజక సంఘం సభ్యులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రజక సంఘం తరపున రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి రజక సంఘం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్, జూపల్లి రాజశేఖర్, రాచకొండ యాదగిరి, రాచమల్ల శ్రీనివాస్, కోశాధికారి రాచకొండ బాల్‌నర్సయ్య, సంయుక్త కార్యదర్శి మగ్రిగడ్డ తిరుపతి, రాచమల్ల సత్తయ్య, రాచమల్ల సీతయ్య, రాచకొండ దశరథ, పరదేశి బిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**తొగుట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** అనారోగ్యంతో మరణించిన మండల పరిధిలోని వెంకట్రావుపేటకు చెందిన సుతారి కనకయ్య కుటు ంబానికి ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో అండగా ఉంటామని మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి హామీ ఇచ్చారు. సుతారి కనకయ్య గాంధీఅసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువ జామున మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న అయన బాధిత కుటుంబీకు లను పరామర్శించి ఓదార్చారు. ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కంకణాల నర్సింలు తో కలిసి రూ. 4500 అర్థిక సహాయాన్ని అందించారు. కనకయ్య మృతి భార్య, పిల్లలు అనాథలయ్యారని అవేదన వ్యక్తం చేశారు. ఎంపి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పిట్ల వెంకటేష్, ఎంగలి వినోద లక్ష్మణ్, నాయకులు పిట్ల వెంకటయ్య, సుతారి రాములు, పాత్కుల బాలేష్, రాంబాబు, కంకణాల స్వామి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# గురువులతోనే సమాజం, వ్యవస్థ మార్పు సాధ్యం : ఎమ్మెల్సీ

**వర్గల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):**
ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వర్గల్‌లో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ ఉత్తమ అవార్డు గ్రహీత రాజశేఖరశర్మతో పాటు జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులుపొందిన 24 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ళుగా ఉపాధ్యాయ బదిలీలు, ప్రమోషన్లు లేవన్నారు. గురువుల ప్రత్యేక దృష్టితోనే సమాజం, వ్యవస్థలో మార్పు ఉంటుందని, అయితే పాలకులు ఉపా ధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే విధంగా వ్యవ హరిస్తూ మానసికంగా వేధిస్తున్నారని తెలిపారు. 317 జివోతో 9శాతం ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుండగా, సింగిల్ టీచర్ల బదిలీలతో 4 శాతం నష్టానికి తెచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా 13 జిల్లా లను ప్రభుత్వం బ్లాక్ లీస్టులో పెట్టడంతో భార్యా భర్తల బదిలీలు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడనప్పటికీ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తుందని,


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, ఎఫ్‌డిసి, జిల్లా పరిషత్ చైర్మన్‌లు

అలాగే నోషనల్ ఇంక్రిమెంట్లు, బదిలీలు, రూ.398 వేతన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రెండు నెలలుగా ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించని పక్షంలో తమ కార్యాచరణ ప్రకటించాల్సి వస్తుందని చీఫ్ సెక్రటరీ దృష్టికి తెచ్చినట్లు స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉంటూ సమస్యల పరి ష్కారంలో భాగస్వాములుకావాలని, ఇందుకు పూర్తి సహకారం ఉంటుందని వివరించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ, ఎంపిపి లతరమేష్ గౌడ్, జెడ్‌పిటిసి బాలమల్లుయాదవ్, పిఎసిఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల విద్యాధికారి సునీత, ఉపాధ్యాయ సంఘ నేతలు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, రాజశేఖరశర్మ, పర్వతం నర్సయ్య, చంద్రారెడ్డి, మల్లికార్జున్, వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హైదారాబాద్‌కు తరలివెళ్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

## సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తాం

**సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంకోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యుఎస్ పిసి) ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా నుంచి పోలీసు నిర్బంధాలను అధిగ మిస్తూ టిపిటిఎఫ్ జిల్లా ప్రతినిధులు ఛలో అసెంబ్లీకి తరలివెళ్లారు. ఛలో అసెంబ్లీకి తరలివెళ్లిన టిపిటిఎఫ్ జిల్లా ప్రతినిధులను అసెంబ్లీ సమీపంలో అక్రమంగా అరెస్టుచేసి నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు విజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, చంద్ర శేఖర్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం యూఎస్‌పిసి(టిపిటిఎఫ్) అనేక ఉద్యమాలు చేపట్టి నప్పటికి ప్రభుత్వం చొరవ చూపడం లేదన్నారు. దసరా సెలవుల్లో ఉపా ధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలచేసి పూర్తి చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో తాత్కాలికంగా నైనా వాలంటీర్లను నియమించాలని, పారిశుధ్య కార్మికులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలన్నారు. 317 జీవో బాధి తుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించే వరకు యుఎస్‌పిసి దశలవారీగా రాజీలేని పోరా టాలు చేస్తుందన్నారు. అనివార్య పరిస్థితుల్లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచ డానికి ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించిన యుఎస్‌పిసి(టిపి టిఎఫ్) ప్రతినిధులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రభుత్వ పిరికిప ంద చర్య అన్నారు. ఇప్పటికైనా సిఎం కెసిఆర్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

## రోడ్డును పరిశీలించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**కొమురవెల్లి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొముర వెల్లి రాజీవ్ రహదారి కమాన్ వరకు 5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిధులు మంజూరు చేయడం పట్ల జడ్పీ టిసి సిలువేర సిద్దప్ప, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గీస భిక్షపతి, నాయకులు సార్ల కిష్టయ్య, తలారి కిషన్, సురేష్, రమేష్, విష్ణు తదితరులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే యాదగిరిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు పంచాయతీరాజ్, అర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి కాలినడకన రోడ్డును పరిశీలించారు. రోడ్డు క్రాస్ అయ్యే దగ్గర స్టేట్‌గా మార్చడానికి రైతులో మాట్లాడారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ హుస్నాబాద్ డివిజన్ ఇంచార్జీ ఏఎస్ఐ మల్లేశం అన్నారు. మంగళవారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులకు మహిళల రక్షణకై ఉన్న చట్టా లతో పాటు ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు, మహిళా అక్రమ రవాణాతో పాటు ఉమెన్ షీటీమ్ ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశాల మేరకు ఈ కార్య క్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు, వేదింపులకు గురైనప్పుడు 100లేదా సిద్దిపేట పోలీస్ కమిష నర్ కంట్రోల్ రూంనంబర్ 8333998699, 7901640473 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, స్పెషల్ ఆఫీసర్ మమతతో పాటు అధ్యాపక బృందం, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి

**మర్కుక్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** మండలంలోని పలు గ్రామాల్లో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను మంగళవారం మండల వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి పంటలకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను రైతులకు సూచించారు. అత్యంత వేగంగా పెరిగే ఈపారాబిల్ట్ అనేది ఒక భౌతికమైన రుగ్మత అని, ఆకులు ఎండిపోవడం, రంగు మారడం దీని లక్షణాలు అని, తెగులు విస్తరించే కొలది ఆకులు రాలిపోవడం, ఎరుపు రంగులోకి మారడం జరుగుతందన్నారు. రైతులు వర్షానికి దెబ్బతిన్న పంటలపై వ్యవసాయాధి కారుల సలహాలు, సూచనలు పాటించి పంటలను రక్షించుకోవాలని తెలిపారు. ఆయనతో పాటు ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకే తొలిమెట్టు

**గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** ప్రభుత్వం విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీయడానికి గానూ తొలిమెట్టు కార్యక్రమం రెండవ రోజు ముగింపు కార్యక్రమం ప్రజ్ఞాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో నోడల్ అధికారి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం, వెనుకబడిన విద్యార్థులను తొలిమెట్టు కార్యక్రమం ద్వారా సాధించవచ్చని తెలియజేశారు. ప్రాణానికి స్థాయి విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ప్రతి పాఠశాల నుంచి మొదటి రోజు 50 శాతం ఉపాధ్యాయులు, రెండవరోజు 50 శాతం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యకమ్రంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, రామకృష్ణారెడ్డి, రిసోర్స్ పర్సన్ మధునాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

**గజ్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య ప్రభ త్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషన్ ఎస్.విద్యాధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న రోడ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలన్నారు. ఐఓసీ నుండి సంగాపూర్ వరకు వీధిలైట్లు వేయాలని, అర్హులైనవారికి పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిది సంవత్సరాలుగా గజ్వేల్ పట్టణంలో ఏ ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని, పట్టణంలో అనేక మంది నిరుపేదలు వందలాది మంది గుడిసెలు వేసుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు రంగారెడ్డి, నర్సింలు, అహ్మద్, శేఖర్, ముఖేష్, రాజు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన శమ్మని దశరథ అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ అశోక్ మండల ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వీరితో పాటు వార్డు సభ్యులు అంబికజయరాం, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములుగౌడ్, రైతు గ్రామ కో–ఆర్డినేటర్ బాల్‌నర్సయ్య, నాయకులు యాదగిరి, మల్లేశం, వెంకటేష్, భాస్కర్‌లు ఉన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**బెజ్జంకి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకొని ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం మండలంలోని దేవక్కపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జనగాం మధనమ్మ వృద్ధురాలు ఇంటిలో నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి ఇల్లు దగ్ధమై ఇంట్లో ఉన్న వస్తువులు, బియ్యం పూర్తిగా కాలిపోయాయని వృద్దురాలు అవేదన వ్యక్తం చేశారు. సంఘటన విషయ ం తెలుసుకున్న సర్పంచ్ కరివేద విజయలక్ష్మీ వృద్దురా లిని పరామర్శించి ఓదార్చి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.


షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన ఇళ్లు, ఇంటిలోని వస్తువులు



ఛలో అసెంబ్లికి తరలుతున్న ఉపాధ్యాయులు

## అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు : శ్రీనివాస్

**మనూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని యుఎస్‌పిసి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు నాగారం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం యుఎస్‌పిసి నాయకులు సంజీవయ్యతో కలసి శ్రీనివాస్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా దశల వారీగా చేస్తున్న ఉద్యమాలకు అనుమతులు ఇవ్వకుండా ఉద్యమాలను అణిచివేసే ధోరణి అవలంభిస్తున్నారన్నారు. దీంతో చలో అసెంబ్లీని నిర్వహించాలనుకుంటే ప్రభుత్వం పోలీసులతో అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మొదటి తారీఖున వేతనాలు అందించడం, పదోన్నతులు, బదిలీలు దసరా సెలవుల్లో పూర్తిచేయడం, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 317జిఒను పునః సమీక్ష చేసి స్థానికతను కాపాడుతూ ఎవరి జిల్లాలకు వారిని పంపాలని, పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని, అటెండర్ స్థాయి పోస్టులు ఇవ్వాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

## పటాన్‌చెరువులో హర్ గర్‌కా బిజెపి



జాతీయ జండాను ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకురాలు గోదావరి

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** బిజెపి అధినాయకత్వం ఆదేశానుసారం మంగళవారం పటాన్‌చెరువులో హర్ గర్‌కా బిజెపి నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మహిళా మాజీ ప్రధానకార్యదర్శి గోదావరి అంజిరెడ్డి గృహంపై పార్టీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి జెండా రెపరెపలాడటం తధ్యమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.

## టిఆర్‌ఎస్ నేతల సంబురాలు



కందిలో సంబురాలు చేసుకుంటున్న టిఆర్‌ఎస్ నాయకులు

**కంది, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా టిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను నియమించడం పట్ల టిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం సంబురాలు చేసుకున్నారు. కందిలో జాతీయ రహదారిపై టపాసులు కాలుస్తూ ఒకరి నోటిని ఒకరు తీపిని తినిపించుకుంటూ సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కంది సర్పంచ్ విమల వీరేశం, ఎంపిపి అధ్యక్షురాలు సరళ, జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, డిసిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, ఆత్మ కమిటి చైర్మన్ క్రిష్ణాగౌడ్, నాయకులు ఖాజాఖాన్, మోహన్ రెడ్డి, శంకర్ గౌడ్, కాసాల రాంరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, నందు కిశోర్, ఆనంద్‌రావు, యండి గౌస్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి హరీష్‌రావుకు సిద్దివినాయక ప్రసాదం



హరీష్‌రావుకు సిద్దివినాయక ప్రసాదాన్ని అందచేస్తున్న నామారవికిరణ

**జహీరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** అంగారక సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురష్కరించుకుని మంగళవారం న్యాల్‌కల్ మండలం రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూవు శ్రీ సిద్దివినాయక ఆలయంలో మంత్రి హరీష్‌రావు కుటుంబీకుల పేర్లపై ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిద్దివినాయక ఆలయానికి దర్శనానికి మంత్రి రావాల్సి ఉండగా శాసనసభ సమావేశాలు ఉండటంతో రాలేకపోయారని, అందుకు అర్చకులు మోహన్‌రావు, వినోద్, ప్రకాశ్‌జ్యోషి వేద మంత్రాలు వల్లిస్తుండగా మంత్రితోపాటు కుటంబ సభ్యుల పేర్లతో స్వామి వారికి అభిషేకం, అర్చన పూజలు నిర్వహించి, హైద్రాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి స్వామి వారి ప్రసాదాన్ని అందచేసినట్లు నామా రవికిరణ్ తెలిపారు.

## చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణకు రావాలని మంత్రికి ఆహ్వానం

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఈ నెల26వ తేదీన పటాన్‌చెరువు నియోజకవర్గంలోని చిట్కుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహావిష్కరణకు రావాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును ఆహ్వానించినట్లు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు పేర్కొన్నారు. మంగళవారం హైద్రాబాద్‌లోని శాసన సభ ప్రాంగణంలో మంత్రిని కలిసి ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరుకావాలని వినతి చేయడం హాజరవుతానని మంత్రి కేటిఆర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, గ్రామాభివృద్దికి తాను చేస్తున్న కృషి పట్ల మంత్రి అభినందించి ముందుకు సాగాలని సూచించారన్నారు. కార్యక్రమంలో జాతీయ రజక సంఘం కో-ఆర్డినేటర్ మల్లేశ్ కుమార్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వర్స పల్లి నర్సింహులు, రజక సంఘం యూత్ అధ్యక్షులు నల్లతీగలరాజు, కార్యదర్శి చాకలి వెకంటేశ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి కేటిఆర్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న చిట్కుల్ సర్పంచ్ మధు

# ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్



మెదక్‌లో పటేల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మెదక్‌పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రాంత విముక్తికై సర్దార్ పటేల్ నేతృత్వంలో నిర్వహించిన ఆపరేషన్ పోలీస్ చర్య ప్రారంభించిన రోజునే సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే నిజాం వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించిన చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్, బానప్పగారి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బెండ వీణ, జిల్లా నాయకులు గడ్డం కాశీనాథ్, ప్రభాకర్‌రెడ్డి, గోవిందరాజ్, ఎంఎల్ఎన్ రెడ్డి, నాగేందర్, అంకం శ్రీనివాస్, జంగం శ్రీనివాస్, సత్యనారాయణగౌడ్, సతీష్, ఆకుల రాము, చింతల మల్లేశం, శేఖర్, లావణ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేటలో...**

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** స్వతంత్ర్య భారతదేశ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన సామాజిక, రాజకీయనాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బిజెపి జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి అన్నారు. మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు మంగళి యాదగిరి ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట పట్టణంలో తెలంగాణ విముక్తికి ఆపరేషన్ పోలో పర్వదినాన్ని పురస్కరించుకోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భారతదేశ సమగ్రతకు, సమైఖ్యతకు మార్గనిర్దేశనం చేసిన మహనియుడు, భారత దేశ ఉక్కు మనిషి సర్ధార్ వల్లభాయ్ అని అన్నారు. అనంతరం తెలంగాణ విముక్తికై ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి పొగుల రాజు, జిల్లా నాయకులు మూర్తి అశోక్, ఓబీసీ మోర్చ అధ్యక్షులు మూర్తిశంకర్, దళితమోర్చా అధ్యక్షులు డప్పు స్వామి, కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు ప్రవీణ్, బీజేవైఎం ఉపాధ్యక్షులు మహెష్, కరుణాకర్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు గజమాలతో సన్మానం చేస్తున్న టీఆర్‌ఎస్ నేతలు

## అన్ని వర్గాల వారికి అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే

**సంగారెడ్డి మున్సిపాలిటీ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** హ్యాండ్లూమ్ చైర్మన్‌గా చింతా ప్రభాకర్ ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మంత్రి హరీష్ రావు ఆశీర్వాదంతోనే తనకు తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కిందన్నారు. 2014లో టీఆర్‌ఎస్ నుండి పోటీ చేసి 36 వేల ఓట్ల పైచీలుకతో గెలుపొందానన్నారు. సంగారెడ్డి అభివృద్ధికి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్‌రావు, చొరవతో సంగారెడ్డి రూపురేకలు పూర్తిగా మార్చామన్నారు. సంగారెడ్డి అభివృద్ధితోపాటు హ్యాండ్లూమ్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని చింతా ప్రభాకర్ తెలిపారు. జిల్లా అభివృద్ధితో పాటు నియోకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నారని అన్నారు. జిల్లా పార్టీ ఉన్నతి ఓ వైపు, జిల్లా సమగ్రాభివృద్ధి ఓ వైపు చూసుకుంటూనే నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్టు చెప్పారు. హ్యాండ్లూమ్ కార్పొరేషన్ అభివృద్ధి చేస్తూ చేనత కార్మికులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

## రెడ్డి ఐక్యవేదిక నేతలు ముందస్తు అరెస్ట్



రెడ్డి ఐక్యవేదిక నేతలను అరెస్ట్ చేసిన కంగ్టి పోలీసులు

**కంగ్టి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన రెడ్డి ఐక్యవేదిక నేతలను అరెస్ట్ చేశారు. గత 2018 ఎన్నికల్లో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికి నెరవేర్చకపోవడంతో మంగళవారం హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో బయలుదేరినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఏఎస్ఐ ఈశ్వర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వెళ్లి రెడ్డి ఐక్యవేదిక నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో రెడ్డి సంఘం మండల అధ్యక్షులు రాంరెడ్డి, భూమారెడ్డి, చంద్రరెడ్డి, సిద్ధరెడ్డి, గుందురెడ్డి, మెండే రాంరెడ్డి, రాంరెడ్డి సంతోష్‌రెడ్డి, పవన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలు ఉన్నారు.

**ఝరాసంగంలో...**





పోలీసుల అదుపులో రెడ్డి సంఘం నాయకులు

**ఝరాసంగం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** చలో అసెంబ్లి కార్యక్రమానికి వెళుతున్న రెడ్డి సంఘం నాయకులను పోలీసులు అరెస్టుచేశారు. రెడ్డి సంఘం రాష్ట్ర కమిటి పిలుపు మేరకు మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రెడ్డి కులస్థులు అసెంబ్లి ముట్టడికి వెళుతున్న క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీసు ఠాణాకు తరలించారు. సాయంత్రం స్వంచ పూచికత్తుపై అదుపులోకి తీసుకున్న వారిని వదిలేశారు. అరెస్టయిన వారిలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ సంగారెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు నవాజ్‌రెడ్డి, జీర్లపల్లి నవాజ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి, సుభాన్ రెడ్డి, మాణిక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ధర్మారెడ్డి, రామిరెడ్డి ఉన్నారు.

## రైతులకు ఎంఏవో ప్రవీణ్ చారి సూచనలు

**కంగ్టి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామల రైతులు భారీగా కురిసిన వర్షానికి పత్తిపంట ఏటవాలుగా నిండుకుపోవడానికి కారణాలు, పత్తి పంటను వేరువ్యవస్థ చుట్టూ అధికంగా నీరు, తేమ చేరి ఉంది. మొక్క వేర్లకు గాలి అందకపోవడంతో మొక్కలు ఉక్కిరిబిక్కిరి గురి అవుతున్నాయి. రైతులు అతరకృషి చేస్తే మంచిదని, వేర్లకు గాలి తగిలే విధంగా కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, 2 గ్రాముల 10 లీటర్ల నీటిని మొక్కల మొదళ్ళకు బాగా తడిపి, తరువాత అడుగుబాగాన గట్టిగ తొక్కలన్నారు. మొక్కలు కోరుకున్నకా యూరియా 25 కేజీలు, పొటాష్ 10 కేజీల చొప్పున వేయవచ్చునని కంగ్టి ఎంఏవో ప్రవీణ్ చారి రైతులకు సూచలను, సలహాలు ఇచ్చారు.

## కసాల రైతువేదికలో డీలర్ల శిక్షణ కార్యక్రమం

**సంగారెడ్డి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** హత్నూర మండలం కసాల గ్రామంలోని రైతువేదికలో మంగళవారం డిఈఎస్ఐ 6వ బ్యాచ్, 2వ క్షేత్ర సందర్శన డీలర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేంద్రియ సేద్యము, అధిక సాంద్రత, పత్తిసాగు, పిఎస్‌బి, పచ్చిరొట్ట సాగు, ఎరువుల యాజామాన్యం, జీవ నియంత్రణ ఎరువుల యాజమాన్యంపై వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, రిటైర్డ్ డిడిఎ రామకృష్ణ, ఎడిఎ విజయరత్నం, జోగిపేట డివిజన్ ఇంఛార్జ్ ఎడిఎ రమేష్, వ్యవసాయ అధికారి ప్రేమలత, బిసిలాబ్, సదాశివపేట వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావ్, ప్రేమ్ రాజ్, డీలర్ రమేష్ లతో పాటు మిగతా మండలాల డీలర్లు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీఆర్‌ఎస్ శ్రేణులు

## సిఎం కెసిఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

**కొండాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలో మంగళవారం టీఆర్‌ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు సిఎం కెసిఆర్ ఫ్లేక్సికి క్షీరాభిషేకం నిర్వహించారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు చింతా ప్రభాకర్‌కు తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు టీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు, సిఎం కేసీఆర్‌కి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పురపాలక, ఐటి శాఖ మంత్రి తారక రామారావు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు, పార్లమెంట్ సభ్యులు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలకు, జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి నాయకులకు కొండాపూర్ మండలం, సంగారెడ్డి నియోజకవర్గంలో ప్రజల కార్యకర్తల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎం విఠల్, మండల జెడ్పిటీసీ పద్మావతి పండు రంగం మాట్లాడుతూ కార్యకర్తల సంతోషం అంబరాన్ని అంటిందన్నారు. చింతా ప్రభాకర్ పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉంటూ ప్రజలకు ఉన్న సమస్యలను తీర్చుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అయితేనేమి అభివృద్ధి పథకాలైతేనేమి ప్రజలకు చేరవేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్న నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి, లక్ష్మీ రామచంద్రయ్య, పి గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రుక్ముద్దీన్, పి బుచ్చిరెడ్డి, మల్లయ్య గౌడ్, డి ప్రేమానందం, సర్పంచ్‌లు, పి ప్రకాష్, రాములు నాయక్, అరవింద్‌రెడ్డి, జగదీష్, నర్సింలు, ఎంపీటీసీలు, మోహన్ గౌడ్, ప్రభాకర్, ఎండి వహీద్, రఘునాథ్‌రెడ్డి, బి కిరణ్, ఎం రాజు, ఏ పవన్, డి నాగయ్య, ఎర్రోళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలి

### ఎమ్మార్పీఎస్ టీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు గర్గుల శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్‌టీఎస్ మెదక్‌జిల్లా అధ్యక్షులు గర్గుల శ్రీనివాస్

**నిజాంపేట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** ఖమ్మంజిల్లా నేలకొండపల్లి ఎస్ఐ స్రవంతిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ఉద్యోగం నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులు గర్గుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో మెదక్ జిల్లా ఎమ్మార్పీ ఎస్ టీఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 సంవత్సరాల ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో పోలీసులకు, ఎమ్మార్పీఎస్ నాయకత్వానికి అవినాభావ సంబంధాలు ఎన్నో ఉన్నాయని, కానీ ఎక్కడ కూడా పోలీసులతో గొడవ పెట్టుకోలేదన్నారు. రాష్ట్రంలో పోలీసుల పట్ల మేము మాట్లాడే విధానం రాష్ట్ర పోలీసు వాళ్లకు తెలసని, ఇలాంటి పోలీస్ వలన నీతి, నిజాయితీ గల పోలీసు అధికారులకు చెడ్డ పేరు వస్తుందని గుర్తు చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి గ్రామంలోని బస్తీలో గణేష్ పండుగలో ఉన్న మాదిగ యువతను మాదిగ నా కొడకల్లారా అని కులం పేరుతో దూషించిన ఎస్ఐ స్రవంతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాష్ట్ర కార్యదర్శి పొట్టిగని లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి బైండ్ల నందు, నిజాంపేట మండల అధ్యక్షులు జనగామ స్వామి, నిజాంపేట పట్టణ అధ్యక్షులు బెల్లి యేసు రాములు, కె స్వామి, బిక్నూర్ పాపిరాజు, మండల కార్యదర్శి లద్ద స్వామి పాల్గొన్నారు.

## నేడు ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**నర్సాపూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** ఈనెల 14న ఉత్తమ ఉపాధ్యాయలకు సన్మానం చేయనున్నట్లు మండల విద్యాధికారి బుచ్యానాయక్ తెలిపారు. నర్సాపూర్‌లోని సాయికృష్ణ పంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు అందరు హాజరయ్యి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఇఓ బుచ్యానాయక్ రోరారు.

## ఎబివిపి పాదయాత్ర

**నిజాంపేట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** నైజాం విముక్త తెలంగాణ స్వాతంత్ర అమృత మహోత్సవంలో భాగంగా మంగళవారం నిజాంపేటలో ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రను ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట నుండి వీర బైరాన్‌పల్లి వరకు 75 కిలోమీటర్ల పాదయాత్రను 75 మంది ఏబీవీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినాన్ని 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ప్రతి ఊరిలో ఏబీవీపీ జెండాలను ఆవిష్కరిస్తూ ఈ పాదయాత్ర బైరాన్‌పల్లి వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లవన్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శశికాంత్, ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, మండల కన్వీనర్ ప్రశాంత్, పట్టణ కార్యదర్శి వేణు, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.





పాదయాత్ర నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

## ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు

**న్యాల్‌కల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** అధిక దిగుబడులు సాధించేందుకు ఆధునిక వ్యవసాయ పద్దతులు పాటించాల్సిన అవసరం ఉందని స్పైసెస్ బోర్డు డైరెక్టర్ శివకుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని హద్నూర్ గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో స్పైసెస్ బోర్డు ఇండియా, హైద్రాబాద్ వారు సంయుక్తంగా అల్లం ఎఫ్‌పిఓలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరిజ్ఞానం, ఎగుమతి క్వాలిటీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శివకుమార్ మాట్లాడుతూ సాంకేతికత ఆధారిత యంత్ర పరికరాలు, హార్వేస్టింగ్‌కు ఉపయోగపడే పరికరాలు, పండిన పంటల ఎగుమతి, నాణ్యతా ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు లేవనెత్తిన పలు సమస్యలకు అధికారులు నివృతి చేశారు. కార్యక్రమంలో ఏడిఏ అంబిక సోని, మండల వ్యవసాయ అధికారి లావణ్య, స్వాతి, ఏఇఓ సాయిలు, రైతులు పాండుపాటిల్, శంభునోళ్ల గుండారెడ్డి, అప్పారావు పాటిల్ పాల్గొన్నారు.

## గీతం అధ్యాపకుడికి డాక్టరేట్

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** పాడైపోయిన ఫొటోలను పునరుద్దరించడానికి వివిధ రకాల అభ్యాస పద్ధతులు అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించిన గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనిషన్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె ప్రవీణ్‌కుమార్‌కు డాక్టరేట్ వరించింది. లార్డ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.వెంకట నరసింహులు, జేఎన్‌టీయూ కాకినాడ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ కె.శివప్రసాద్‌లు పరిశోధనను పర్యవేక్షించినట్లు గీతం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవీణ్‌కుమార్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం కాకినాడలోని ప్రతిష్ఠాత్మక జేఎన్‌టీయు విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం అదనపు ఉపకులపతి ప్రొ. డీఎస్‌రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొ. సీతారామయ్య, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొ. మాధవి, ఆయా విభాగాల అధిపతులు, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్‌ను అభినందించారు.

## మేళకువలు పాటిస్తే అధిక దిగుబడులు : ఏఓ శ్రీనివాస్‌రెడ్డి

**మనూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** వ్యవసాయంలో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మనూర్‌లో రైతులు సాగు చేస్తున్న పంటలను ఏఇఓ సాయికిరణ్‌రెడ్డి, మహేష్‌లతో కలిసి పరిశీలించిన సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట వేరు వ్యవస్థ నీటితో నిండుకుందని గుర్తించామన్నారు. పంట వేర్లకు ఆక్సిజన్ అందకుంటే మొక్క ఎదిగే అవకాశం ఉండదని, దీంతో పంటదిగుబడి ఉండదని పేర్కొన్నారు. పంటలో అంతర్ కృషి చేయాలని వివరించారు. కాపర్ ఆక్సి క్లోరైడ్ 30 గ్రాములు, ప్లాంటోమైసిన్ 2 గ్రామాలును 10 లీటర్ల నీటిలో కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచకారి చేసుకోవాలన్నారు. మొక్కలు కోలుకున్నాక బూస్టర్ డోస్‌గా 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను పంటలో వినియోగించాలని అవగాహన కల్పించారు.

## ప్రైవేటు వద్దు..ఆర్టీసి ముద్దు : డిఎం బక్షినాయక్

**మనూర్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ప్రజలు సురక్షిత ప్రయాణానికి ఆర్టీసిలోనే ప్రయాణించాలని, ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరమని నారాయణఖేడ్ డిపో మేనేజర్ బక్షి నాయక్ తెలిపారు. మంగళవారం మనూర్‌లోని గ్రామ పంచాయితీ కార్యక్రమంలో ప్రజల వద్దకు ఆర్టీసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బక్షినాయక్ మాట్లాడుతూ మనూర్ ప్రజలకు ప్రతి అర గంటలకు బస్సు సౌకర్యం ఉందని, అందుకు ప్రయవేటు వాహనాల్లో ప్రయాణించవద్దని సూచించారు. గ్రామ సర్పంచ్ విఠల్‌రావు మాట్లాడుతూ ప్రజలు ఆర్టీసిని కాదని ప్రయివేటు జోలికి పోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు, డిపో అధికారులు శివాజీరావుపాటిల్, విఠల్‌రావు పాటిల్, పాండులు పాల్గొన్నారు.

## 15న ఎన్‌డిడిని సద్వినియోగం చేసుకోవాలి

**న్యాల్‌కల్, సెప్టెంబరు 13,ప్రభాతవార్త:** ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న నట్టల నివారణ(ఎన్‌డిడి)ని కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ నరేందర్ సూచించారు. మండలంలోని మిర్జాపూర్(బి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ, అంగన్‌వాడి, ఎఎన్‌ఎంలకు ఈ నెల 15న నిర్వహించనున్న ఎన్‌డిడి కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిధిలోని ఆయా గ్రామాల్లోని గృహాల్లో, పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న 1 నుంచి 19 ఏండ్ల వయసు వారికి ఆల్బాడోస్ మందుబిళ్లలను అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ అవగాహన కల్పించారు. నట్టలకు దూరంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, కుటుంబాల పెద్దలకు అవగాహన కల్పించాలని వివరించారు.

**ఆశవర్కర్‌లకు చీరల పంపిణీ...**

ప్రభుత్వం అందచేసిన చీరలను ఆస్పత్రి పరిధిలో సేవలు అందిస్తున్న ఆశావర్కర్‌లకు ఎంపిపి అధ్యక్షురాలు అంజమ్మ పంపిణీ చేశారు. ఆస్పత్రి పరిధిలో విధులు నిర్వహిస్తున్న 24 మంది ఆశావర్కర్లు చీరలను మంగళవారం పంపిణి చేశారు. ఆయా కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు శామల, మల్లికార్జున్, ఎఎన్ఎం, ఆశావర్కర్లు, అంగన్‌వాడిల బాధ్యులు పాల్గొన్నారు.

## వినాయక ఆలయాల్లో భక్తుల సందడి

**న్యాల్‌కల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** అంగరాక సంకష్టహార చతుర్థి పర్వదినాన్ని మంగళవారం మండలంలోని రేజింతల్, హద్నూర్, చీకూర్తి గ్రామాల్లోని స్వయంభూవు శ్రీసిద్దివినాయక, శ్రీవరసిద్ది వినాయక ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయాలకు కాలినడకన చేరుకుని దైవదర్శనం చేసుకున్నారు. రేజింతల్ సిద్దివినాయక ఆలయం, పరిసరాలను రంగురంగు పూలతో అలంకరించడంతో ఆలయ ప్రాంగణం శోభాయమానంతో సంతరించుకుంది. డిఎస్‌పి రఘు పర్యవేక్షణలో జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీసు ఠాణాల పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తును నిర్వహించారు. రేజింతల్ ఆలయ అర్చకులు మోహన్‌రావు, వినోద్, ప్రకాశ్ జ్యోషిలు, హద్నూర్ ఆలయంలో గణపతి దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రేజింతల్, హద్నూర్ గ్రామాల్లోని ఆలయాలకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

## వెంకటేశ్వరుడిని దర్శించుకున్న కాటా శ్రీనివాస్‌గౌడ్

**పటాన్‌చెరువు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల కొండపై కొలువున్న ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని పటాన్‌చెరువు నియజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**కొల్చారం, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** ప్రతి ఉద్యోగికి ఉద్యోగ రీత్యా చేసిన సేవలు గుర్తింపునిస్తాయని కొల్చారం ఎంపీపీ కొరబోయిన మంజుల కాశీనాథ్, జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని హనుమమ్మ గార్డెన్స్‌లో గురు పూజోత్సవం పురస్కరించుకొని మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవమును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొల్చారం ఎంపీపీ కొరబోయిన మంజులకాశీనాథ్, జెడ్పీటీసీ ముత్యంగారి మేఘమాల సంతోష్ కుమార్‌లు హాజరయ్యారు. మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయులకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగరీత్యా చేసిన సేవలు గుర్తింపునిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజరెడ్డి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

**మరుగుదొడ్డి వాడండి..**

**బహిరంగ మల విసర్జనకు దూరం కండి : డీఎల్‌పీవో రాజేంద్రప్రసాద్**

**నిజాంపేట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** ప్రజలంతా కలిసి బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని డీఎల్పీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఓడీఎఫ్ ప్లస్ మోడల్ కుటుంబ సర్వేను మంగళవారం ప్రారంభించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, వరుగుదొడ్ల వాడకం, నిర్వహణ తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. పారిశుధ్య పనులను, ఓడీఎఫ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మరుగుదొడ్లను వాడుతూ పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆరుబయట మల విసర్జన చేయడం ఆరోగ్యానికి ప్రమాదకరమని చెప్పారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించి బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు నడుం బిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఎంపీవో సతీష్, ఏపీవో ఈశ్వరమ్మ, సర్పంచి లద్ద ప్రీతి, ఎంపీటీసీ లద్ద సురేష్, పంచాయితీ కార్యదర్శి మహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, టీఏ స్వామి, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.